ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5



తమిళనాడు

TAMILNADU

గురువారం 19 సెప్టెంబరు 2024



బాలాజీ (ఫైల్‌ఫోటో)

నగరంలో మరో ఎన్‌కౌంటర్

వ్యాసార్పాడి వద్ద పోలీసులపై కాల్పులు ● ఎదురు కాల్పుల్లో రౌడీ బాలాజీ హతం

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. తమపై తిరగబడి నాటుతుపాకీతో కాల్పులకు పాల్పడిన ఓ రౌడీని పోలీసులు మట్టుబెట్టారు. స్థానిక వ్యాసార్పాడి బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ ప్రాంతం వద్ద ఈ ఘటన జరిగింది. పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో పేరు మోసిన రౌడీ కాక్కాతోప్పు బాలాజీ హతమయ్యాడు. వివరాలిలా... బ్రాడ్వే బీఆర్ఎన్ గార్డెన్ కాక్కాతోప్పు ప్రాంతానికి చెందిన బాలాజీ (45) హత్యలు, హత్యాయత్నాలకు, దారిదోపిడీలకు పాల్పడుతూ పేరుమోసిన రౌడీగా చెలామణి అవుతున్నాడు. అతడిపై నగరంలో, చుట్టుపక్కలి జిల్లాల్లోని పోలీసుస్టేషన్లలో సుమారు 59 కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో అతడిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసుబృందం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. ఆ మేరకు బుధవారం ఉదయం బాలాజీ ఉత్తర చెన్నై ప్రాంతంలో దాగి ఉన్నాడనే రహస్య సమాచారం అందటంతో పోలీసులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులను చూడగానే అతడు కారులో పారిపోయేందుకు ప్రయత్నించాడు.

ఆ కారు వ్యాసార్పాడి జీవానగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ రోడ్డు వెళుతుండగా పోలీసులు చుట్టుముట్టి లొంగిపొమ్మంటూ హెచ్చరికలు చేశారు. బాలాజీ పోలీసుల హెచ్చరిక పట్టించుకోకుండా నాటు తుపాకీతో కాల్పులు జరిపాడు. తన కారు దగ్గరకు వస్తున్న కొడుంగయూరు సీఐ శరవణన్‌పైకి బాలాజీ కాల్పులు జరిపాడు. అదృష్టవశాత్తూ ఆ తూటా పోలీసు వాహనంలో దూసుకెళ్ళింది. దీంతో సీఐ శరవణన్ ఆత్మరక్షణ కోసం కాల్పులు జరుపటంతో బాలాజీ శరీరంలోకి తూటాలు దూసుకుపోయి అతను కారులోనే పడిపోయాడు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి రౌడీ బాలాజీ అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు.

పదేళ్లుగా నేరాలకు దూరంగా వున్నా మట్టుబెట్టారు

పదేళ్లుగా నేరాలకు దూరంగా ఉంటూ నిరుపేదలకు సేవలు, అన్నదాన కార్యక్రమాలు చేస్తూ ప్రజల మధ్య మంచిపేరు తెచ్చుకున్న కాక్కాతోప్పు బాలాజీని పోలీసులు ఓ పథకం ప్రకారం హత్య చేశారని అతడి తల్లి కన్మణి ఆరోపించారు. మీడియాతో పదేళ్లుగా తన కుమారుడు సత్ప్రవర్తనతో జీవిస్తున్నాడని, తనపై నమోదైన కేసులన్నింటినీ పరిష్కరించుకుంటున్నాడని తెలిపారు. మంగళవారం ఉదయం ఏడుగంటలకు తనకు ఫోన్ చేసి మాట్లాడాడని, మా ఇంట ఓ బిడ్డ పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు వస్తానన్నాడని ఆమె తెలిపారు.. బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో పోలీసులు వెదుకుతున్న సంభవ్ సెంథిల్ తన కుమారుడు బాలాజీ స్నేహితులు కొందరిని హతమార్చాడని కన్మణి తెలిపారు. అన్నాసాలైలో బాంబు దాడి జరిపింది కూడా సంభవ్ సెంథిల్ అని ఆమె ఆరోపించారు. త్వరగా పెళ్ళి చేసుకోమని చెబుతున్నానని ఆలోగా పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడని తెలిపారు. తన కుమారుడి హత్యకు సంభవ్ సెంథిల్ ప్రధాన కారణమని, అందరూ కుట్రపన్ని పోలీసులకు సమాచారం ఇచ్చి హతమార్చారంటూ బోరున విలపించారు.



మీడియాతో మాట్లాడుతున్న బాలాజీ తల్లి కన్మణి

ఎవరీ బాలాజీ?

బ్రాడ్వే కాక్కాతోప్పు ప్రాంతానికి చెందిన బాలాజీ తొమ్మిదో తరగతి వరకు చదివాడు. ఆ ప్రాంతంలో చిన్న చిన్న నేరాలకు పాల్పడేవాడు. బాలాజీ బంధువు దురై పేరుమోసిన రౌడీగా చెలామణి అవుతుండటం, అతడిని చూసి స్థానికులంతా భయపడి నమస్కారాలు చేయటం గమనించాడు. ఆ బంధువులాగే తాను కూడా రౌడీ కావాలని అనుకున్నాడు. అర్ధాంతరంగా చదువు మానేసి, రౌడీయిజానికి దిగాడు. ఉత్తర చెన్నై ప్రాంతానికి చెందిన ఇన్బరాజ్, యువరాజ్ అనే రౌడీలతో పరిచయం ఏర్పరచుకున్నాడు. ఆ తర్వాత మూలకొత్తలం ప్రాంతానికి చెందిన రౌడీ దాము తమ్ముడు పుష్పను బాలాజీ, యువరాజ్, ఇన్బరాజ్ కలిసి దారుణంగా హత్య చేశాడు. రౌడీ బాలాజీపై నమోదైన తొలి హత్య కేసు ఇదే. అనంతరం బాలాజీకి యువరాజ్‌కు మధ్య మనస్పర్థలు ఏర్పడగా యువరాజ్ హత్యకు గురయ్యాడు. ఇక అప్పటి నుండి ఉత్తర చెన్నైలో బాలాజీ పేరుమోసిన రౌడీగా చెలామణి అయ్యాడు. పలు నేరాలు చేసి తరచూ జైలుకు వెళ్లే బాలాజీకి డెల్టా జిల్లాలకు చెందిన పేరుమోసిన రౌడీ మనల్‌మేడు శంకర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత బాలాజీ రౌడీల లిస్టులో మొదటిస్థానంలో నిలిచాడు. మనల్‌మేడు శంకర్ ఎన్‌కౌంటర్‌లో హతమైన తర్వాత ఉత్తర చెన్నైలో బాలాజీ ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడ్డాడు. సంపాదన అధికం కావటంతో విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డాడు. 2015లో ఉత్తర చెన్నైలోని ఓ ఇంటి పైకప్పు నుండి దిగి సురేష్ అనే రౌడీని అతడి భార్య కళ్లెదుటే బాలాజీ దారుణంగా హత్య చేశాడు. ఆ హత్య జరిగిన కొన్ని గంటల్లోగా బాలాజీ టీమ్ సతీష్ అనే రౌడీని హతమార్చింది. దీంతో రోజురోజుకూ బాలాజీకి ప్రత్యర్థులు, శత్రువుల సంఖ్య పెరగింది. దీంతో కొద్ది నెలలుగా శత్రువులకు భయపడి బాలాజీ అజ్ఞాతవాసంలో గడిపాడు. ఈ పరిస్థితుల్లోనే బాలాజీ మళ్లీ ఉత్తర చెన్నైకి వచ్చి దాక్కున్నట్టు రహస్య సమాచారం అందటంతో అతడి ఆచూకీ కనుగొని అరెస్టు చేయడానికి కొడుంగయూరు సీఐ శరవణన్ నాయకత్వంలో ప్రత్యేక పోలీసుల బృందం ఏర్పాటైంది. చివరకు బుధవారం ఉదయం వ్యాసార్పాడి బీయస్ఎన్ఎల్ క్వార్టర్స్ రోడ్డులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కాక్కాతోప్పు బాలాజీ తన కారులోనే హతమయ్యాడు.



కడలూరు రోడ్డులో రాస్తారోకో చేస్తున్న ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలు

'ఇండియా' కూటమి బంద్ ప్రశాంతం

● పుదుచ్చేరిలో స్తంభించిన రవాణా

● కాంగ్రెస్, డీఎంకే, వామపక్షాల ధర్నా

పుదుచ్చేరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, ప్రీపెయిడ్ మీటర్ పథకాన్ని, విద్యుత్ బోర్డు ప్రైవేటు పరం చేసే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, డీఎంకే, వామపక్షాల నేతృత్వంలోని 'ఇండియా' కూటమి నేతృత్వంలో జరిగిన బంద్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. బంద్ కారణంగా ప్రైవేటు రవాణా పూర్తిగా స్తంభించగా, ప్రభుత్వ రవాణా కూడా కొంతమేరకు నిలిచిపోయింది. బంద్ వల్ల పుదుచ్చేరిలోని కొన్ని ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలు మూతబడ్డాయి.

పుదుచ్చేరిలో ధర్నా...

ఇండియా కూటమి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ధర్నా, రాస్తారోకో జరిగింది. కడలూరు రోడ్డు వెంకటసుబ్బారెడ్డియార్ విగ్రహ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. డీఎంకే నేత శివా, కాంగ్రెస్ నేత వైద్యలింగం నాయకత్వంలో జరిగిన ఈ ఆందోళనలో వందలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారాయణసామి, మాజీ మంత్రి కందసామి, మాజీ ఎమ్మెల్యే బాలన్, డీఎంకే ఎమ్మెల్యే సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఆందోళన సందర్భంగా ఆ మార్గంలో వెళుతున్న బస్సులు, కార్లు, ఆటోలను అడ్డుకుని రాస్తారోకో జరిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో పోలీసులు బలప్రయోగంతో కార్యకర్తలను తొలగించేందుకు ప్రయత్నించారు. కానీ వారి ప్రయత్నం ఫలించలేదు. పార్టీల నాయకులు, కార్యకర్తలంతా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఇదే విధంగా విల్లియనూరు, చేత్రాపట్టు, బాగూరు తదితర ప్రాంతాల్లోనూ ఇండియా కూటమి పక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. పోలీసులు జోక్యం చేసుకుని సుమారు 500 మందిని అరెస్టు చేశారు.

మద్రాసు హైకోర్టు సీజేగా కేఆర్ శ్రీరాం



జస్టిస్ కేఆర్ శ్రీరాం

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ముంబైకి చెందిన జస్టిస్ కేఆర్ శ్రీరాం నియమితులయ్యారు. మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఆర్.మహాదేవన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపై వెళ్లిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జస్టిస్ కృష్ణకుమార్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ముంబై హైకోర్టు న్యాయమూర్తి కేఆర్ శ్రీరాంను నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ముంబైలో జన్మించిన శ్రీరాం, ముంబై విశ్వవిద్యాలయంలో ఫైనాన్స్, ఎంబీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. అనంతరం లండన్‌లోని కింగ్స్ కళాశాలలో ఎల్ఎల్ఎం కోర్సు పూర్తిచేశారు. 1986లో మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, అప్పటి నుంచి ఆయన న్యాయవాదిగా రాణిస్తున్నారు. ముఖ్యంగా, నౌక వాణిజ్య సంబంధిత అంతర్జాతీయ చట్ట నైపుణ్యంతో పలు కేసులను సమర్థవంతంగా పరిష్కరించారు. 2013 ముంబై హైకోర్టు అదనపు న్యాయమూర్తిగాను, 2016లో శాశ్వత ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఎనిమిదేళ్ల ముంబై హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ కేఆర్ శ్రీరాం మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు హైకోర్టు వర్గాలు తెలిపాయి.

లెజెండరీ నటి శకుంతల కన్నుమూత

అడయార్, సెప్టెంబరు 18: తమిళ చిత్ర పరిశ్రమలో మరో విషాదం నెలకొంది. లెజెండరీ నటి ఏ.శకుంతల అలియాస్ సీఐడీ శకుంతల (84) మంగళవారం రాత్రి కన్నుమూశారు. తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం తదితర భాషల్లో నటించిన ఆమె 1970లో జయశంకర్ హీరోగా నటించిన 'సీఐడీ శంకర్' అనే చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. అప్పటి నుంచి ఆమె పేరు సీఐడీ శకుంతలగా మారిపోయింది. సేలం జిల్లా అరిసిపాళెయంకు చెందిన శకుంతల చెన్నైలో లలిత, పద్మిని, రాగిణి నిర్వహించే నృత్య కార్యక్రమాల్లో పాల్గొని నృత్యం చేసేవారు. 1960లో 'ఖైదీ కన్నాయిరం' అనే చిత్రంలో డ్యాన్సర్‌గా తొలిసారి వెండితెరపై కనిపించారు. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించారు.



ఏ.శకుంతల (ఫైల్‌ఫోటో)

అలా అగ్ర నటులు ఎంజీఆర్, శివాజీ గణేశన్ చిత్రాల్లో మంచి పాత్రలను దక్కించుకున్నారు. 'పడిక్కాద మేధై', 'కై కొడుత్త దైవం', 'తిరుడన్', 'తవపుదలవన్', 'వసంత్ మాలిగై', 'నీతి', 'భారత విలాస్', 'రాజ రాజ చోళన్', 'పొన్నూంజల్', 'ఎన్ అన్నన్', 'ఇదయ వీణై' వంటి చిత్రాల్లో నటించారు. 1988 నుంచి సినిమాల్లో నటించడం మానేసిన తర్వాత ఆమె బుల్లితెర సీరియళ్ళ నటిస్తూ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించారు. వయోభారం కారణంగా బెంగళూరులోని తన కుమార్తె వద్ద ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆమెకు ఛాతిలో నొప్పి రావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. శకుంతల మృతిపట్ల కోలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు.

గౌరవంగా ఆహ్వానిస్తే వెళదాం

● డీపీఐ మహానాడుపై ఈపీఎస్ స్పందన



చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2వ తేదీ డీపీఐ నిర్వహించ తలపెట్టిన మద్యనిషేధ మహానాడుకు తమ పార్టీని గౌరవప్రదంగా ఆహ్వానిస్తే పాల్గొనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అన్నారు. కళ్లకురిచ్చి జిల్లా ఉళుందూరుపేటలో బుధవారం జరిగిన అన్నాడీఎంకే నేత ఇంటి వివాహ వేడుకల్లో ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే సంపూర్ణ మద్యనిషేధం కోరుతూ జరుపతలపెట్టిన మహానాడుకు ఆ పార్టీ నేతలు అన్నాడీఎంకేని గౌరవప్రదంగా ఆహ్వానిస్తే ఆ మహానాడులో పాల్గొనే విషయమై పార్టీ సీనియర్ నేతలతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామన్నారు. తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్ ద్రావిడ రంగు పులుముకుంటున్నారంటూ కొన్ని పార్టీల నేతలు చెబుతున్న విషయంపై ఈపీఎస్ స్పందిస్తూ ఓనం పండుగకు శుభాకాంక్షలు తెలిపిన విజయ్, వినాయక చవితికి శుభాకాంక్షలు తెలుపని విషయాన్ని గుర్తు చేశారు. ఇక తాజాగా పెరియార్ జయంతి సందర్భంగా ఆయన స్మారక స్థలం వద్ద విజయ్ నివాళులర్పించటం చూస్తుంటే ఆయన ద్రావిడ పార్టీల మార్గాన్ని ఎంచుకున్నారేమోననే భావించాల్సి వస్తుందని ఈపీఎస్ అభిప్రాయం వ్యక్తంచేశారు. వచ్చే శాసనసభ ఎన్నికల దృష్ట్యా పార్టీని మరింతగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామని, త్వరలో పార్టీలో కొత్త పదవులు కూడా సృష్టించి సీనియర్ నాయకులకు కేటాయించే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని కూడా ముమ్మరంగా నిర్వహిస్తామన్నారు. ఈ వివాహ వేడుకల్లో ఈపీఎస్‌తోపాటు మాజీ మంత్రి పి.మోహన్, మాజీ శాసనసభ్యుడు కుమారగురు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సీనియర్లతో స్టాలిన్ భేటీ

● డీఎంకే వజ్రోత్సవాలపై సమాలోచన

అడయార్, సెప్టెంబరు 18: స్థానిక తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో పార్టీ సీనియర్ నేతలతో ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం హఠాత్తుగా సమావేశమయ్యారు. ఇందులో భాగస్వామ్య పార్టీల నేతలు పాల్గొనే డీఎంకే వజ్రోత్సవ బహిరంగ సభపై సమాలోచన జరిపారు. డీఎంకే 75వ వార్షికోత్సవం, పెరియార్, అన్నాదురై జయంతి వేడుకలను కలిపి ముప్పెరు విళా పేరుతో మంగళవారం రాత్రి నందనంలోని వైఎంసీఏ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 28న కాంచీపురంలో భారీ బహిరంగసభ నిర్వహించనున్నారు. ఇందులో డీఎంకే భాగస్వామ్య పార్టీల నేతలంతా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సీనియర్ నేతలైన దురైమురుగన్, టీఆర్ బాలు, ఏ.రాజా, మంత్రులు ఏవీ వేలు, పొన్ముడి తదితరులతో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలతో పాటు వజ్రోత్సవ బహిరంగ సభ తదితర అంశాలపై సమాలోచనలు జరిపినట్టు తెలుస్తుంది.



గతంలో కురిసిన వర్షాలకు బస్‌డిపోలో చేరిన నీరు (ఫైల్‌ఫోటో)

ముంపు ప్రాంతాలకు ముందుగానే పడవలు, రక్షణ పరికరాలు

● ఆదాయ నిర్వహణ కమిషనర్ అముద




పెరంబూర్, సెప్టెంబరు 18: నగరంలో గత ఏడాది ఈశాన్య రుతుపవనాల సమయంలో, ముంపుకు గురైన ప్రాంతాలను గుర్తించి పడవలు, రక్షణ పరికారాలు ముందుగానే పంపించే చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఆదాయ నిర్వహణ కమిషనర్ అముద తెలిపారు. నగరంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలను ఎదుర్కొనేందుకు రాష్ట్రప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. తొలివిడతగా, అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపిన ఉత్తర్వుల్లో జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికలో అధికారుల ఫోన్ నెంబర్లు మారినట్లయితే వాటిని జతచేయాలని సూచించామని తెలిపారు. రాష్ట్రస్థాయిలో విపత్తుల నిర్వహణపై చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలపై గత శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సమీక్షా సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాజధాని నగరం చెన్నైపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారని తెలిపారు. చెన్నై జిల్లా లోతైన ప్రాంతం, సముద్రతీర ప్రాంత జిల్లాగా ఉందన్నారు. అందువల్ల, గతంలో సంభవించిన వరదలు పరిగణలోకి తీసుకొని రుతుపవనాలకు ముందుగానే ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. నగరంలో గతంలో వర్షాలు కురిసి పలు ప్రాంతాలు ముంపునకు గురైన తర్వాత సహాయక చర్యలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ఏడాది ముందు ప్రాంతాలకు గుర్తించి, ఆ ప్రాంతాలకు ముందుగానే పడవలు, రక్షణ పరికరాలు తరలించనున్నామన్నారు. అక్టోంబరు 15వ తేది ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కానున్నాయని, అక్టోబరు రెండు వారంలోగా ఈ పనులు పూర్తిచేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే, ముంపు ప్రాంతాల ప్రజలను ముందుగానే హెచ్చరించేలా 'టీఎన్ అలర్ట్' యాప్‌ను పరిచయం చేశామన్నారు. తమ ప్రాంతాల్లో ఏ సమయంలో ఎంత మేరకు వర్షపు నీరు చేరుతుంది, అంతకు ముందుగానే ఆ ప్రాంత ప్రజలు సమీపంలోని శిబిరాలకు పంపించేలా హెచ్చరించనున్నామన్నారు. ఈ విషయాలు ఆయా ప్రాంత ప్రజల సెల్‌ఫోన్లకు మెసేజ్ పంపేలా చర్యలు చేపట్టామని, ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని కమిషనర్ అముద విజ్ఞప్తి చేశారు.

గడువు లోగా చేరకపోతే రూ.10లక్షల జరిమానా

● వైద్య విద్యార్థులకు వైద్య విద్యా మండలి హెచ్చరిక

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండో విడత కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు పొంది, నిర్ణీత గడువులోగా ఆయా కోర్సుల్లో చేరని అభ్యర్థులకు రూ.10 లక్షల జరిమానా విధించనున్నట్లు రాష్ట్ర వైద్యవిద్యా మండలి అధికారులు ప్రకటించారు. తొలి విడత కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత ప్రభుత్వ, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో 1423 ఎంబీబీఎస్ సీట్లు, 1586 బీడీఎస్ సీట్లు భర్తీకాలేదు. దీంతో ప్రభుత్వ కోటా, మేనేజ్‌మెంట్ కోటా ప్రకారం దరఖాస్తులు చేసిన 40వేల మందికి పైగా అభ్యర్థులకు ఈ నెల 14న ప్రారంభమైంది. ఈ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు తమకు నచ్చిన కళాశాలలను ఎంచుకునే గడువు కూడా మంగళవారంతో ముగిసింది. ర్యాంకుల ప్రకారం సీట్లు పొందిన అభ్యర్థుల వివరాల జాబితా గురువారం విడుదల చేయనున్నారు. ఆ జాబితా పరిశీలించిన మీదట అభ్యర్థులు అడ్మిషన్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 26లోగా ఎంపిక చేసుకున్న కళాశాలలో అడ్మిషన్లు పొందాలని కూడా వైద్యవిద్యా మండలి అధికారులు ప్రకటించారు. కళాశాలల్లో చేరేందుకు నిర్ణయించిన గడువులోగా రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఆ కోర్సుల్లో చేరకపోతే ఎలాంటి అపరాధం విధించరని తెలిపారు. అదే సమయంలో అడ్మిషన్ గడువు దాటిన తర్వాత కళాశాలల్లో అభ్యర్థులు చేరకపోతే రూ.10లక్షల వరకు అపరాధం విధించనున్నట్లు అధికారులు హెచ్చరించారు. ఇదే విధంగా మూడో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొంది, ఎంపిక చేసుకున్న కళాశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు సమర్పించి, ఆ అడ్మిషన్ల గడువు ముగిసిన తర్వాత కోర్సులలో చేరని అభ్యర్థులకు రూ.10లక్షల అపరాధంతోపాటు ఫీజు సొమ్ము, కాషన్ డిపాజిట్ సొమ్ము వాపసు చేసే ప్రసక్తి ఉండదని అధికారులు తెలిపారు. మెడిసిన్ సీట్లు పొందే విద్యార్థులు ఈ వివరాలను తెలుసుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు పేర్కొన్నారు.





చెన్నై సచివాలయంలో సమాచార శాఖలో కారుణ్య ప్రాతిపదికన ముగ్గురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి సామినాథన్

సమాచార ధ్వని

బీఎడ్ దరఖాస్తు స్వీకరణకు 26 చివరి తేదీ

ఐసిఎఫ్, సెప్టెంబరు 18: బీఎడ్ దరఖాస్తు స్వీకరణ ఈ నెల 26వ తేదీతో ముగియనుంది. రాష్ట్రంలోని బీఎడ్ కళాశాలల్లో యూజీ కోర్సుల్లో తమిళం, ఆంగ్లం, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సహా 13 పాఠ్యాంశాల్లో చేరేందుకు ఇటీవల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.tngasa.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా, డీడీ రూపంలో రూ.500 దరఖాస్తు రుసుము చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చెల్లించాలి.

నేటినుంచి భారత్-బంగ్లాదేశ్ టెస్ట్ మ్యాచ్ టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, సెప్టెంబరు 18: స్థానిక చేపాక్కంలోని చిదంబరం స్టేడియంలో గురువారం నుంచి భారత్-బంగ్లాదేశ్ మధ్య ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్ జరుగనుంది. మ్యాచ్ జరిగే ఐదు రోజులు ఉదయం 7 గంటల నుంచి స్టేడియంలోని కౌంటర్లలో టిక్కెట్లు కొనుగోలు చేయవచ్చు. టిక్కెట్ ధర రూ.200 నుంచి రూ.1,000గా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

రోప్‌కార్ సమయం పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 18: రాణిపేట జిల్లా షోలింగర్‌లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లేందుకు రోప్‌కార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోప్‌కార్ సేవలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పెరటాసి నెల కావడంతో శని, ఆదివారాల్లో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో, రోప్‌కార్ సేవలు పొడిగిస్తూ ఆలయ నిర్వాహకులు ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకారం, పెరటాసి నెల ఐదు శని, ఆదివారాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోప్‌కార్ సేవలు పొడిగించారు. అలాగే, అక్టోబరు 2 మహాలయ అమావాస్య సందర్భంగా ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోప్‌కార్ సేవలు పొడిగించారు.

గిరి ప్రదక్షిణకు అన్‌రిజర్వ్‌డ్ మెము రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 18: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ గిరి ప్రదక్షిణ సందర్భంగా విల్లుపురం-తిరువణ్ణామలై-విల్లుపురం మధ్య అన్ రిజర్వ్‌డ్ మెము రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● నెం.06145 విల్లుపురం-తిరువణ్ణామలై అన్ రిజర్వ్‌డ్ మెమో రైలు ఈ నెల 20,21,22, 27,28,29, అక్టోబరు 4,5,6,11,12,13,18,19, 20,25,26,27, నవంబరు 1,2,3,8,9, 10,15,16,17,22, 23,24 తేదీల్లో (శుక్ర, శని, ఆదివారాలు) విల్లుపురంలో రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 10.45 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గం లో ఈనెల 21,22,23,28, 29,30, అక్టోబరు 5,6,7,12,13, 14,19,20,21,26,27,28, నవంబరు 2,3,4,9,10, 11,16,17,18,23,24,25 (శని, ఆది, సోమవారాలు) తిరువణ్ణామలైలో వేకువ జామున 3.30 గంటలకు బయల్దేరి తెల్లవారుజామున 5గంటలకు విల్లుపురం చేరుకుంటుంది.

'కురింజి' వికసించే ప్రాంతంలో పర్యాటకుల నిషేధం

పెరంబూర్, సెప్టెంబరు 18: ఊటీ సమీపంలో కురింజి పూలు వికసించే పర్వత ప్రాంతానికి బయట వ్యక్తులెవ్వరూ వెళ్లరాదని, ఉత్తర్వులు ఉల్లంఘించే వారికి జరిమానా విధిస్తామని జిల్లా అటవీ శాఖ హెచ్చరించింది. ఎప్పనాడు సమీపంలోని పిక్కబతి మందు కొండల్లో 12 ఏళ్లకొకసారి నీల కురింజి పూలు పూస్తాయి. కురింజి పూలు పూసే పర్వత శ్రేణులు రక్షిత అటవీ ప్రాంతం కావడం, జంతువుల సంచారం అధికంగా ఉండడంతో బయట వ్యక్తులకు నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు.

ఎగుమతుల్లో కాంచీపురం ప్రథమస్థానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 18: రాష్ట్ర ఎగుమతుల్లో కాంచీపురం జిల్లా ప్రథమస్థానంలో ఉన్నట్లు కేంద్రప్రభుత్వ విదేశీ వర్తక డైరెక్టరేట్ తెలిపింది. రాష్ట్రం ఆధునిక అవసరాలకు తగ్గట్టు మార్పులు చేపడుతూ, ఎగుమతుల్లో ముందంజలో ఉంది. జౌళి, రెడీమేడ్, లెదర్ వస్తువులు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్, పట్టుచీరలు, అద్దాలు, నార వస్తువులు సహా వివిధ వస్తువులను ఎగుమతి చేస్తోంది. దేశంలో అధిక ఎగుమతి చేసే మూడో పెద్ద రాష్ట్రంగా తమిళనాడు ఉంది. దేశం మొత్తం ఎగుమతుల్లో రాష్ట్రం 9.25 శాతం వాటా కలిగి ఉంది. రాష్ట్రానికి సంబంధించిన ఎగుమతుల్లో కాంచీపురం జిల్లా మొదటిస్థానం, చెన్నై రెండో స్థానం, కోయంబత్తూర్ మూడవ స్థానంలో ఉంది.

ఉచిత యోగా శిక్షణా తరగతులు

పెరంబూర్, సెప్టెంబరు 18: సత్యానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో వేళచ్చేరి, నంగనల్లూర్, సూరాపేటలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. నంగనల్లూర్‌లో సుదర్శన్ టెర్రస్ హాలు, బి-2, లక్ష్మీ నగర్ మెయిన్ రోడ్డులో ఈ నెల 30వ తేది, వేళచ్చేరిలో తిరువీధి అమ్మన్ ఆలయ ప్రాంగణంలో అక్టోబరు 1వ తేది, సూరాపేటలో అరుల్‌జ్యోతి అరుణాలయం, సూరాపేట సన్మార్గ సంఘంలో అక్టోబరు 2 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. నాలుగు వారాల పాటు ప్రతిరోజు ఉదయం 5.30 నుంచి 7 గంటలు (సోమవారం నుంచి శనివారం వరకు) జరిగే తరగతుల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9841227709, 9445051015 (నంగనల్లూర్), 8754499334, 9445051015 (వేళచ్చేరి), 9841150877, 9440551015 (సూరాపేట) నెంబర్లు సంప్రదించి పేరు నమోదుచేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

జాతీయ రహదారిలో మొక్కలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 18: జాతీయ రహదారుల కమిషన్ ఆధ్వర్యంలో తాంబరం నుంచి మధురవాయల్ వరకు 2,500 మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. వాయుకాలుష్యం తగ్గించేందుకు ఈ శాఖ చర్యలు చేపట్టింది. జాతీయ రహదారులకిరువైపుల, మధ్యలో ఇప్పటివరకు 22 లక్షల మొక్కలు నాటగా, తాంబరం నుంచి మధురవాయల్ బైపాస్ రోడ్డు వరకు మంగళవారం 2,500 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చెన్నై బైపాస్ రోడ్డు ప్రణాళిక డైరెక్టర్ రవీంద్రరావు, వానగరం పంచాయతి అధ్యక్షులు జమున శ్రీనివాసన్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్‌కు 1,685 ప్రత్యేక మార్గాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 18: వ్యవసాయం కోసం 1,685 ప్రత్యేక విద్యుత్ మార్గాలు ఏర్పాటు ప్రారంభమైంది.. గ్రామాల్లో గృహాలు, వ్యవసాయం, దుకాణాలకు ఒకే మార్గంలో విద్యుత్ సరఫరా అవుతోంది. వ్యవసాయానికి ప్రతిరోజు 18 గంటలు, ఇతర కనెక్షన్లకు 24 గంటలు విద్యుత్ సరఫరా అవుతోంది. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయని సమయంలో కొందరు అక్రమ కనెక్షన్లకు పాల్పడుతున్నారు. ఈ మార్గాల్లో గృహాలకు లో పవర్ సరఫరా అవుతోంది. ఈ సమస్య గుర్తించిన విద్యుత్ బోరు వ్యవసాయ కనెక్షన్లకు 1,685 ప్రత్యేక మార్గాలను ఏర్పాటుచేస్తోంది.

గవర్నర్‌కు నల్లజెండాలతో స్వాగతం

కాంగ్రెస్, డీపీఐ కార్యకర్తల అరెస్టు

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవికి నల్లజెండాలతో స్వాగతం పలికేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్, డీపీఐ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. నాగపట్టినంలోని తమిళనాడు డాక్టర్ జె.జయలలిత మత్స్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు బుధవారం ఉదయం గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆ నగరానికి వెళ్లారు. ఆ సమయంలో కాంగ్రెస్ జిల్లా శాఖ కార్యదర్శి అమృతరాజ్ నాయకత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు, డీపీఐ కార్యకర్తలు నాగపట్టినంలోని నాగైపుదూరు ఫ్లైఓవర్ సమీపంలో నల్లజెండాలు పట్టుకుని గవర్నర్‌కు స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. పోలీసులు జోక్యం చేసుకుని వారిని అడ్డుకున్నారు. ఆ సందర్భంగా పోలీసులకు కార్యకర్తలకు మధ్య తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. ఆ తర్వాత పోలీసులు ఆందోళనలో పాల్గొన్న రెండు పార్టీల కార్యకర్తలు సుమారు వందమందిని అరెస్టు చేశారు. ఈ ఆందోళన కారణంగా ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్, డీపీఐ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

వైభవంగా విశ్వకర్మ మహాయాగం



ప్రత్యేక అలంకరణలో విశ్వకర్మ

వేలూరు, సెప్టెంబరు 18: స్థానిక బేరిపేటలో విశ్వకర్మ సముదాయానికి చెందిన కాళికాంబాల్ ఆలయంలో బుధవారం విశ్వకర్మ మహాయాగం జరిగింది. కార్యక్రమానికి విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు రవి, సెక్రటరీ శ్రీనివాసన్, కోశాధికారి జగన్నాథన్ తదితరుల అధ్యక్షతన జరిగింది. ఆలయ అర్చకుడు జ్యోతిమురుగాచారి అభిషేకం, పూజలు చేశారు. అలంకార తిలకమ్ రాము ఆచారి స్వామి వారికి అలంకారం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో విశ్వకర్మ స్నేహితుల సంఘం సెక్రటరీ జనార్ధనన్, కాళికాంబాల్ ఆలయ ట్రస్టీ సుందరన్, మహాదేవ మలై నాగరాజ స్వామి, ఉభయదారులు, దేవస్థాన అమావాస్య ఊంజల్ సేవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.91.3 కోట్లతో కాంక్రీట్ కాలువ

ఐసిఎఫ్, సెప్టెంబరు 18: స్థానిక కొళత్తూర్ ప్రాంతంలో రూ.91.3 కోట్ల వ్యయంతో కాంక్రీట్ కాలువ నిర్మాణపనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ ప్రాంతం వర్షాకాలంలో ముంపునకు గురవుతోంది. ఈ సమస్య పరిష్కరించేలా వరద నీరు తొలగించేందుకు వందడుగుల రోడ్డులో రహదారుల శాఖ పంపింగ్ స్టేషన్ ఏర్పాటుచేసింది. ఈ నేపథ్యంలో, కొళత్తూర్, మాధవరం ప్రాంతాల మీదుగా తనికాచలం కాలువలో కలిసేలా 3.05 కి.మీ పొడవు, 4 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ కాలువ నిర్మాణం ఆగస్టులో ప్రారంభమయ్యాయి. 90 శాతం పనులు పూర్తికాగా, ఈ నెలాఖరులోపు మిగిలిన పనులు పూర్తవుతాయని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

మూడు రోజుల్లో 25,000 మంది పడవ సవారీ

పెరంబూర్, సెప్టెంబరు 18: ఓనం, మిలాద్ ఉన్ నబి పండుగల సందర్భంగా కన్నియాకుమారిలో మూడు రోజుల్లో 25,000 మంది పడవ సవారీ చేశారు. కన్నియాకుమారిని సందర్శించే పర్యాటకులు సముద్రం మధ్య వివేకానందరాక్ వద్దకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. పర్యాటకుల సౌకర్యార్థం పుంపుహార్ సంస్థ వివేకానంద రాక్‌కు పడవలు నడుపుతోంది. ఆ ప్రకారం, ఓనం పండుగ సందర్భంగా ఈ నెల 8వ తేది 8,000 మంది, సోమవారం 8,500, మిలాన్ ఉన్ నబి పండుగ సందర్భంగా మంగళవారం 8,600 మంది, మూడురోజుల్లో మొత్తం 25,100 మంది పడవ సవారీ చేసినట్లు పుంపుహార్ సంస్థ తెలియజేసింది.

కోయంబేడు సమీపంలో ఆక్రమణ తొలగింపు

ఐసిఎఫ్, సెప్టెంబరు 18: స్థానిక కోయంబేడు మార్కెట్ సమీపంలో ఆక్రమణ దుకాణాలను సీఎండీఏ అధికారులు తొలగించారు. ఈ మార్కెట్ సమీపంలో 300లకు పైగా దుకాణాలు ఏర్పాటుచేసి కొందరు వ్యాపారం చేస్తున్నారు. వస్తువులు కొనుగోలు చేసేందుకు వెళ్లే వారు తమ వాహనాలు రోడ్డుపై పార్క్ చేయడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో, సీఎండీఏ అధికారులు, పోలీసులు మంగళవారం ఆక్రమణ దుకాణాలు తొలగించారు.

విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, సెప్టెంబరు 18: ఉత్తర చెన్నై విద్యుత్ కేంద్రంలో మంగళవారం రాత్రి విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టు లోని ఉత్తర చెన్నై ఎక్స్‌టెన్షన్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో తలా 600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. మొదటి యూనిట్‌లో సోమవారం రాత్రి బాయిలర్ ట్యూబ్ పంచర్ కావడంతో ఉత్పత్తికి అంతరాయం కలిగింది.

రెండో వారం కూడా ఉత్పత్తి నిలిపివేత...

తిరువళ్లూర్ జిల్లా వల్లూరులో ఉన్న జాతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో రెండో వారం కూడా ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక్కడ తలా 500 మెగావాట్ల సామర్థ్యంతో మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరుగుతోంది. అందులో రాష్ట్రానికి ప్రతిరోజు 1,060 మెగావాట్ల విద్యుత్ కేటాయిస్తున్నారు. ఇటీవల ఓ యూనిట్‌లో ఉత్పత్తి నిలిచిపోగా, మూడో యూనిట్‌లో టర్బైన్ తనిఖీ కోసం మంగళవారం ఉత్పత్తి నిలిపివేశారు. ఈ నెల 27వ తేది అనంతరం ఉత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

పాఠశాలలో పార్టనర్ పేరిట రూ.12.23 కోట్ల మోసం

● మహిళా విద్యాధికారి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 18: పాఠశాలలో పార్టనర్‌గా చేర్చుతామంటూ రూ.12.23 కోట్ల మోసానికి పాల్పడిన ఆలంగుళం తాలూకా విద్యాధికారి చిత్ర, ఆమె భర్తను అరెస్ట్ చేసిన పోలీసులు, పాఠశాల కరస్పాండెంట్ కోసం గాలిస్తున్నారు. ధర్మపురి జిల్లా కడత్తూరులో 2016లో ఎవరెస్ట్ మున్నిరత్నం గ్రీన్ పార్క్ మెట్రిక్యులేషన్ పాఠశాల ప్రారంభించారు. పాఠశాల ప్రారంభం సమయంలో పార్టనర్స్‌ను ఆహ్వానించిన ఆయన, ఒక్కొక్కరి వాటా రూ.25 లక్షల చొప్పున వంద మంది నుంచి సేకరించి పాఠశాల నడుపుతున్నాడు. పార్టనర్స్‌ను ఆహ్వానించేలా రిటైర్డ్ టీచర్ సంపత్ (67), ఆలంగుళం విద్యాధికారి చిత్ర (59), ఆమె భర్త సెల్వం (65)లు ఏజెంట్లుగా వ్యవహరించి పలువురి నుంచి సుమారు రూ.12 కోట్ల వరకు పెట్టుబడిగా స్వీకరించినట్లు సమాచారం. ఆరేళ్లయినా పెట్టుబడులకు సంబంధించిన లాభాలు, వడ్డీ ఇవ్వకపోవడంతో, బాధితుల్లో ఒకరైన పార్థసారధి ధర్మపురి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, మహిళా విద్యాధికారి చిత్ర, ఆమె భర్త సెల్వం, రిటైర్డ్ టీచర్ సంపత్‌లను మంగళవారం అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న కరస్పాండెంట్ మునిరత్నం కోసం గాలిస్తున్నారు.

మాంజోలై ఎస్టేట్ వ్యవహారం...

మానవహక్కుల సంఘం విచారణ



విచారణ కమిటీ సభ్యులకు స్వాగతం పలుకుతున్న పుదియ తమిళగం నేత డాక్టర్ కృష్ణసామి

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాంజోలై టీ ఎస్టేట్‌లో పనిచేస్తున్న కార్మికులను ఆ ఎస్టేట్ నిర్వహిస్తున్న ది బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ బలవంతంగా ఖాళీ చేయిస్తోందనే ఆరోపణలపై విచారణ జరిపేందుకు జాతీయ మానవ హక్కుల సంఘం విచారణ కమిటీ తిరునల్వేలికి బుధవారం ఉదయం వచ్చింది. బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన లీజు గడువు ముగియడానికి ఇంకా రెండేళ్లున్నప్పటికీ ఆ సంస్థ కార్మికులను మాంజోలై ప్రాంతం నుంచి బలవంతంగా ఖాళీ చేయించే పనులు చేపట్టింది. పలువురు కార్మికులతో స్వచ్ఛంద పదవీ విరమణలు కూడా చేయించింది. ఈ ఆరోపణలపై కార్మిక సంఘాలు హైకోర్టు ఆశ్రయించడంతో తేయాకు కార్మికుల భవిష్యత్ జీవనాధారాలు మెరుగయ్యేంతవరకూ కార్మికులను మాంజోలై కొండపై నుంచి ఖాళీ చేయించకూడదంటూ హైకోర్టు ఉత్తర్వుజారీ చేసింది. ఈ వివరాలతో పుదియతమిళగం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణసామి జాతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షులు జస్టిస్ విజయభారతి సయానీకి వినతి పత్రం సమర్పించారు. ఆ వినతి పత్రాన్ని పరిశీలించిన అనంతరం ఆ సంఘం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. మాంజోలై ప్రాంతాలను సందర్శించి నెలల్లోగా నివేదిక సమర్పించాలని ఆ సంఘం ఉత్తర్వు జారీ చేసింది. ఆ మేరకు విచారణ కమిటీ సభ్యులుగా ఉన్న అధికారులు, రవి సింగ్, యోగేంద్ర కుమార్ త్రిపాఠీ బుధవారం ఉదయం తిరునల్వేలి నగరానికి వచ్చారు. వీరికి పుదియ తమిళగం నేత డాక్టర్ కృష్ణసామి స్వాగతం పలికారు. ఈ విచారణ కమిటీ సభ్యులు నాలుగు రోజులపాటు తిరునల్వేలిలోనే బసచేసి విచారణ జరపనుంది. బుధవారం మధ్యాహ్నం ఈ విచారణ కమిటీ మాంజోలై తేయాకు ఎస్టేట్ ప్రాంతానికి వెళ్ళి కార్మికుల వద్ద విచారణ ప్రారంభించింది. ఆ తర్వాత మాంజోలై తేయాకు ఎస్టేట్ కార్మికుల సమస్యలకు సంబంధించిన వివరాలతో కూడిన 1126 పేజీల నివేదికను జిల్లా కలెక్టర్ కార్తికేయన్ మానవహక్కుల సంఘం విచారణ కమిటీ సభ్యులకు సమర్పించారు.

10 మంది జాలర్లకు రూ. 3.5 కోట్ల జరిమానా

శ్రీలంక కోర్టు వింత తీర్పు ● నిరసనగా జాలర్ల ధర్నా

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ దేశ సముద్ర జలాల్లోకి అక్రమంగా చొరబడ్డారనే నేరారోపణపై అరెస్టయిన పది మంది తూత్తుకుడి జాలర్లకు శ్రీలంక కోర్టు రూ.3.5 కోట్ల జరిమాన, ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ శ్రీలంక కోర్టు తీర్పు వెలువరించింది. జాలర్ల ఆర్థిక స్థోమత తెలిసి కూడా శ్రీలంక కోర్టు ఇంత భారీ మొత్తంలో అపారాధం విధించటం పట్ల శిక్షపడిన జాలర్లు కోర్టు ఎదుట ధర్నా జరిపారు. ఆగస్టు 20న సముద్రంలో చేపలవేటకు వెళ్ళిన 22 మంది జాలర్ల శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. వీరిలో 12 మందికి తలా రూ.1.5 కోట్ల చొప్పున జరిమాన విధించారు, జరిమానా చెల్లించకపోతే ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ శ్రీలంక కోర్టు ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తక్కిన 10 మంది జాలర్లకు రూ.10.5 కోట్ల మేర శ్రీలంకలోని పుత్తళం కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కోర్టు విచారణకు ముగ్గురు జాలర్లు అనారోగ్యం కారణంగా హాజరుకాలేదు. మిగతా ఏడుగురు జాలర్లు మాత్రమే విచారణకు హాజరయ్యారు. ఈ తీర్పు వెలువడిన తర్వాత ఏడుగురు జాలర్లు పుత్తళం కోర్టు ఎదుట రాస్తారోకో, ధర్నా నిర్వహించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు



గుడియాత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

వేలూరు, సెప్టెంబరు 18: గుడియాత్తం తంగ నగర్ ప్రాంతంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాలు దండుకుంటున్నాని జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో, కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఏసీబీ అధికారులు, లెక్కల్లో చూపని రూ.75 వేలు స్వాధీనం చేసుకుని అధికారులు, ఉద్యోగులను విచారిస్తున్నారు.

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రజా హక్కుకు వ్యతిరేకం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్

పెరంబూర్, సెప్టెంబరు 18: 'ఒకే దేశం-ఒకే ఎన్నిక ప్రజల ఎన్నికల హక్కుకు వ్యతిరేకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. రాజ్యాంగం ద్వారా ఆమోదింపబడిన దేశం, ప్రజల రాజ్యాంగం ప్రజా ప్రతినిధి ప్రభుత్వ వ్యవస్థను సవరిస్తూ 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'కు బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. నయా ఉదారవాదం యొక్క ప్రతికూల ఫలితంగా, ఎన్నికల్లో అధికారం, డబ్బు, ముఠాల ఆధిపత్యం పెరిగిందన్నారు. రాజ్యాంగం ద్వారా అధికారాన్ని పొందిన స్వతంత్ర రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఎన్నికల సంఘం తటస్థంగా వ్యవహరించడం అప్పడప్పుడూ పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. అయితే మన పార్లమెంటరీ వ్యవస్థలో, ప్రజల అంతిమ అధికారం యొక్క ప్రాథమిక లక్షణం భద్రపరచి ఉందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాలరాసేలా తాజాగా కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిన ఒకే దేశం-ఒకే ఎన్నిక ప్రజల ఎన్నికలు హక్కుల కాలరాసేదిగా ఉందని ముత్తరసన్ ఆరోపించారు.

విద్యార్థి ఆత్మహత్య

అడయార్, సెప్టెంబరు 18: సమాజంలో ఇలాంటి మహిళలున్నంత వరకు అనేక మంది మరణిస్తూనే ఉంటారని సూసైడ్ లేఖ రాసిపెట్టి ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. కొళత్తూరు ప్రాంతానికి చెందిన పవిత్రన్ (21) వ్యాసార్‌పాడిలోని ఓ కాలేజీలో బీకాం చదువుతూ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఇటీవల ఓ ఇంటికి ఫుడ్ డెలివరీ చేసేందుకు వెళ్ళగా, అక్కడ ఓ మహిళకు, పవిత్రన్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో పవిత్రన్‌ను ఆ మహిళ దుర్భాషలాడింది. దీంతో తీవ్ర మనస్థాపానికి లోనైన పవిత్రన్ ఈ నెల 13వ తేదీ ఆమె ఇంటికి వెళ్ళి కిటికీ అద్దాలను పగులగొట్టాడు. ఈ విషయాన్ని ఆమె భర్తకు చెప్పగా, ఆయన కొరట్టూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పవిత్రన్‌ను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. దీంతో మానసికక్షోభకు గురైన పవిత్రన్.. మంగళవార రాత్రి ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నాడు. 'ఫుడ్ డెలివరీ చేసేందుకు వెళ్ళిన చోట ఓ మహిళ పరుష పదజాలంతో దూషించింది, దీంతో తీవ్ర మానసికక్షోభకు గురయ్యాను. ఇలాంటి మహిళలు ప్రపంచంలో ఉన్నంత వరకు మరణాలు సంభవిస్తూనే ఉంటాయి' అంటూ సూసైడ్ లేఖ రాసిపెట్టాడు. దీన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు విచారణ జరుపుతున్నారు.

జాఫర్ సాధిక్‌పై చార్జిషీటు దాఖలు

● అమీర్ పేరు కూడా

అడయార్, సెప్టెంబరు 18: మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో సినీ నిర్మాత జాఫర్ సాధిక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు చార్జిషీటు తయారు చేసి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో సమర్పించారు. సినీ దర్శక హీరో అమీర్‌తో సహా మొత్తం 12 మంది పేర్లు ప్రస్తావించారు. చట్ట వ్యతిరేక నగదు లావాదేవీలకు అమీర్ పాల్పడినట్టు ఈడీ చార్జిషీటులో పేర్కొంది. ఇందులో జాఫర్ సాధిక్, ఈయన భార్య అమీనా బాను, జాఫర్ సోదరుడు మహ్మద్ సలీం పేరు కూడా ఉంది. మొత్తం 302 పేజీలతో రూపొందించిన ఈ చార్జిషీటులో జాఫర్ సాధిక్ సినీ బ్యానరుతో పాటు మొత్తం 8 కంపెనీల పేర్లను పొందుపరిచగా, సినీ దర్శకుడు అమీర్ పేరును 12వ నిందితుడిగా చేర్చారు.

పేదల నివాసాలకు గిండీ రేస్ కోర్స్ స్థలం

● సీపీఎం డిమాండ్



ఆందోళనలో సీపీఎం నాయకులు జి.రామకృష్ణన్ తదితరులు

పెరంబూర్, సెప్టెంబరు 18: స్థానిక గిండీ రేస్ కోర్స్ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, అంతర్జాతీయ క్రీడా మైదానం, పేదలకు గృహాలు నిర్మించాలని సీపీఎం నాయకులు జి.రామకృష్ణన్ డిమాండ్ చేశారు. గిండీ రేస్ కోర్సు యాజమాన్యం కోట్ల రూపాయల అద్దె బకాయిలుంచడంతో కోర్టు ఉత్తర్వుల మేరకు ఆ క్లబ్‌కు అధికారులు సీలు వేశారు. ఈ నేపథ్యంలో, రేస్ క్లబ్ స్థలాన్ని ప్రభుత్వ స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం క్లబ్ ప్రవేశద్వారం వద్ద ధర్నా నిర్వహించారు.

సేతు ఎక్స్‌ప్రెస్ నుంచి విడిపోయిన బోగీలు

● తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో కలకలం



విడిపోయిన బోగీలు

పెరంబూర్, సెప్టెంబరు 18: సేతు ఎక్స్‌ప్రెస్ నుంచి మూడు బోగీలు విడిపోవడం కలకలం రేపింది. చెన్నై ఎగ్మూర్-రామేశ్వరం-చెన్నై ఎగ్మూర్ మధ్య ప్రతిరోజు 23 బోగీలతో సేతు ఎక్స్‌ప్రెస్ రైలు నడుపుతున్నారు. యథావిధిగా రామేశ్వరం నుంచి మంగళవారం రాత్రి చెన్నూర్‌కు రైలు బయల్దేరింది. వేకువజామున 1.30 గంటలకు రైలు తిరుచ్చి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫారంపైకి చేరుకుంటున్న సమయంలో రైలు వెనుక ఉన్న మూడు అన్ రిజర్వ్‌డ్ బోగీలు రైలు నుంచి విడిపోయాయి. ఊహించని ఈ ఘటనకు ప్రయాణికులు భయాందోళనలతో కేకలు వేయడంతో డ్రైవర్ రైలును నిలిపివేశారు. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని విడిపోయిన మూడు బోగీలను రైలుకు జతచేశారు. దీంతో, 20 నిమిషాల ఆలస్యంగా తిరుచ్చి నుంచి చెన్నై ఎగ్మూర్‌కు సేతు ఎక్స్‌ప్రెస్ బయల్దేరింది.

మాజీ మంత్రి కె.సుందరం కన్నుమూత



కె.సుందరం (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 18: డీఎంకే నేత, మాజీ మంత్రి, పొన్నేరి మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఆదిద్రావిడ సంక్షేమ విభాగం అధ్యక్షుడు కె.సుందరం (76) అనారోగ్యంతో కన్నుమూశారు. మీంజూరులోని తన ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన మృతిచెందడం పార్టీ శ్రేణులను దిగ్భ్రాంతికి గురిచేసింది. తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి నియోజకవర్గం నుంచి ఆయన రెండుసార్లు గెలుపొందారు. 1989 డీఎంకే ప్రభుత్వ హయాంలో ఆదిద్రావిడ సంక్షేమశాఖ మంత్రిగా, 1996-2001 డీఎంకే హయాంలో పాడిపరిశ్రమల శాఖ మంత్రిగా వ్యవహరించారు. 2001లో అదే నియోజకవర్గం నుంచి పరాజయం పొందారు. డీఎంకే అత్యంత ముఖ్యమైన పదవుల్లో ఒకటైన డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఆయన పనిచేశారు. గత ఏడాది డీఎంకే ముప్పెరుం విళాలో కె.సుందరానికి, ముఖ్యమంత్రి స్టాలిన్ 'అన్నా పురస్కారం' ప్రదానం చేసి గౌరవించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయనను సీఎం స్వయంగా ఇంటికెళ్లి పరామర్శించారు. ఆయన మృతి పార్టీకి లోటని డీఎంకే నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

కొవిడ్‌తో మృతి.. రూ. కోటి పరిహారం

● వినియోగదారుల ఫోరం ఉత్తర్వులు

వేలూరు, సెప్టెంబరు 18: స్థానిక కాట్పాడి గాంధీ నగర్‌కు చెందిన నారాయణన్ కొన్ని సంవత్సరాల క్రితం రూ.1.1 కోట్లకు ఎల్ఐసీ పాలసీ తీసుకున్నారు. సగం పాలసీ చెల్లించిన ఆయన తదుపరి వాయిదాలు చెల్లించేందుకు వీలుకాలేదు. అనంతరం తన పాలసీ రెన్యువల్ చేయాలని ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో 2021 మేలో నారాయణన్ కొవిడ్ కారణంగా మృతిచెందాడు. ఆయన కుటుంబానికి ఎల్ఐసీ రూ.37,80,767 చెల్లించింది. అదే సమయంలో పాలసీ పూర్తిగా చెల్లించకపోవడంతో పూర్తి మొత్తం ఇవ్వలేమని అధికారులు తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యులు వినియోగదారుల ఫోరంలో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారించిన న్యాయమూర్తి మీనాక్షిసుందరం, మృతుడి కుటుంబానికి పాలసీ మొత్తం చెల్లించాలి, ప్రస్తుతం ఇచ్చిన నగదుతో పాటు మిగిలిన రూ.63,19,233 ఇవ్వాలని, మానసికంగా ఇబ్బంది పడిన కుటుంబానికి మరో రూ. లక్ష, కోర్టు ఖర్చులకు రూ.25 వేలు చెల్లించాలని ఎల్ఐసీని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

● 9 గంటల ఆలస్యం

అడయార్, సెప్టెంబరు 18: చెన్నై నుంచి సింగపూర్ బయలుదేరి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానంలో టేకాఫ్‌కు కొద్ది క్షణాల ముందు సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆ విమానం 9 గంటల ఆలస్యంగా బయలుదేరి వెళ్ళింది. పైలెట్ల అప్రమత్తతో 174 మంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఎయిర్ ఇండియా విమానం సింగపూర్ నుంచి చెన్నైకు మంగళవారం రాత్రి అర్ధగంట ఆలస్యంతో 12.21 గంటలకు చేరుకుంది. ఈ విమానం తిరిగి అర్ధరాత్రి 1.40 గంటలకు చెన్నై నుంచి సింగపూర్ వెళ్లే విమానం టేకాఫ్ అయ్యేందుకు సిద్ధంగా ఉంది. ఆ సమయంలో పైలెట్లు విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఇంజనీర్లు వచ్చి సాంకేతిక లోపాన్ని సరిచేసిన తర్వాత బుధవారం ఉదయం 10.32 గంటలకు ఆ విమానం సింగపూర్‌కు బయలుదేరి వెళ్ళింది. దీంతో విమాన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

పోక్సో చట్టం కింద అరెస్టయిన ఖైదీ మృతి

వేలూరు, సెప్టెంబరు 18: స్థానిక పేర్నాంబట్టుకు చెందిన అనీస్ అహ్మద్ (42) షూ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనికి వివాహమై ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. ఈ క్రమంలో రెండో కుమార్తె అనారోగ్యంతో ఉండడంతో తల్లి నసీమా గుడియాత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లింది. బాలికను పరీక్షించిన వైద్యులు ఆమె 4 నెలల గర్భంతో ఉన్నట్లు తెలిపారు. వైద్యుల మాటలకు దిగ్భ్రాంతి చెందిన నసీమా గుడియాత్తం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో... బాలికపై ఆమె తండ్రి అనీస్ అహ్మద్ అత్యాచారానికి పాల్పడ్డాడని తెలియడంతో, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు అనీస్‌ను అరెస్ట్ చేసి వేలూరు జైలుకు తరలించారు. గత వారం అనీస్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక అతను మృతిచెందాడు.

రోజుకు నాలుగు గంటలే ఆన్‌లైన్ గేమ్ ?

● ప్రభుత్వ పరిశీలన

పెరంబూర్, సెప్టెంబరు 18: అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు ఆన్‌లైన్ గేమ్‌లపై నిషేధం విధించే అంశం రాష్ట్రప్రభుత్వ పరిశీలనలో ఉంది. కొద్దికాలంగా తమిళనాడు సహా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ జూదం ద్వారా నగదు కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రాష్ట్రంలో మాత్రమే సుమారు 30 మంది ఆన్‌లైన్ జూదం ద్వారా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో, రాత్రి వేళల్లో ఆన్‌లైన్ గేమ్స్‌కు నిషేధం విధించాలని, ఆన్‌లైన్ గేమ్‌లకు చెల్లించే డిపాజిట్ కూడా భారీగా పెంచాలని రాష్ట్రప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలాగే, చిన్నారులు కూడా ఈ గేమ్స్‌కు బానిసలు అవుతుండడంతో, రోజులకు నాలుగు గంటలు మాత్రమే ఆన్‌లైన్ గేమ్‌కు అనుమతి, ఈ గేమ్‌కు ఆడేవారికి ఆధార్ తదితర కార్డుల అప్‌లోడ్ తదితర ఆలోచనలు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు సచివాలయ వర్గాల సమాచారం.

షవర్మ తిన్న టీచర్ మృతి

అడయార్, సెప్టెంబరు 18: షవర్మ ఆరగించిన ఒక మహిళా ఉపాధ్యాయురాలు తీవ్ర అస్వస్థతకుగురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. నగర శివారు ప్రాంతమైన మధురవాయల్, నూంబల్ తిరువీధి అమ్మన్ ఆలయ వీధికి చెందిన శ్వేత (28) స్థానికంగా ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈమె గత వారం పోరూర్‌లో ఉన్న ఒక దుకాణంలో షవర్మ కొనుగోలు చేసి తిన్నారు. దుకాణం నుంచి ఇంటికి వెళ్ళిన తర్వాత వాంతులు విరేచనాలు కావడంతో ప్రభుత్వ స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న ఆమె బుధవారం ఉదయం ప్రాణాలు విడిచారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

సేలంలో 148 కేజీల గుట్కా స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 18: బెంగుళూరు నుంచి సేలం మీదుగా రాష్ట్రంలోకి అక్రమంగా కారులో తీసుకొచ్చిన 148 కేజీల గుట్కాతో పాటు పాన్‌పరాగ్ ప్యాకెట్లను ప్రత్యేక బృందం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన రాజస్థాన్‌కు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు... బెంగళూరు నుంచి సేలం మీదుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమణ రవాణా సాగిస్తున్నట్టు సేలం జిల్లా పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో జిల్లా సరిహద్దు ప్రాంతమైన తీవపట్టి ప్రాంతంలో ప్రత్యేక బృందం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా, ఒక కారు ఆపి తనిఖీ చేయగా అందులో 148 కేజీల గుట్కా ప్యాకెట్లతో పాటు పాన్‌పరాగ్ ప్యాకెట్లను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని అక్రమంగా తీసుకొస్తున్న రాజస్థాన్‌కు చెందిన మాణిక్‌చంద్, మితేష్ పడియార్, మంగళ్‌రామ్ లను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్ల విలువ రూ.4 లక్షల మేరకు ఉంటాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మాదక ద్రవ్యాల స్మగ్లర్లతో కుమ్మక్కు

● 850 మంది పోలీసులపై త్వరలో వేటు

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు జరిపిన పరిశీలనలలో మాదక ద్రవ్యాల అక్రమరవాణా దారులకు సుమారు 850 మంది పోలీసులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించారనే విషయం బహిర్గతమైంది. ఈమేరకు ఇంటెలిజెన్స్ అధికారులు సమగ్రమైన నివేదిక తయారు చేసి డీజీపీ శంకర్ జివాల్‌కు ఇటీవలే సమర్పించారు. రాష్ట్రంలో విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుండి గంజాయి తదితర మాదక ద్రవ్యాలను తీసుకొస్తున్నారు. ఈ మాదకద్రవ్యాలను తరలించే ముఠాలకు పోలీసు అధికారులు అన్ని విధాలా సహకరిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ అధికారులు గత యేడాది డిసెంబర్ వరకూ చేపట్టిన పరిశీలన, తనిఖీల ద్వారా తెలుసుకున్నారు. వీటికి సంబంధించి కీలకమైన ఆధారపత్రాలు కూడా సేకరించారు. జూన్ వరకూ మాదక ద్రవ్యాల అమ్మకం, అక్రమరవాణా తదితర సంఘటనలపై 4522 కేసులు నమోదైనట్లు కూడా కనుగొన్నారు. ఇప్పటివరకూ మాదక ద్రవ్యాల కేసుల్లో 22, 447 మందిని అరెస్టు చేసినట్లు తెలుసుకున్నారు. ఇక ఈ మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలకు సహకరించిన 850 మంది పోలీసులను కూడా గుర్తించి వారి జాబితాను డీజీపీకి సమర్పించారు. త్వరలో ఈ పోలీసులపై డీజీపీ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు చెబుతున్నారు.



'సేవకర్' చిత్ర ఆడియో రిలీజ్ దృశ్యం

కథ లేకుంటే నిర్మాతే లేదు

● కె.భాగ్యరాజ్

నిర్మాత లేకుంటే దర్శకుడు, హీరో లేరని నిర్మాత కె.రాజన్ అంటున్నారనీ, తన వరకు మంచి కథంటూ లేకపోతే అస్సలు నిర్మాత అనేవారే లేరని సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ అన్నారు. సిల్వర్ మూవీస్ పతాకంపై రాజన్ జోసెఫ్ థామస్ నిర్మాణ సారథ్యంలో రూపొందిన చిత్రం 'సేవకర్'. ప్రిజన్, షకానా జంటగా నటించగా, బోస్ వెంకట్, ఆడుకలం నరేన్, మదురై శరవణన్, ఉడుమలై రాజేష్, షీమా శంకరి, రూపా, సునీల్, బాలు, షాజి కృష్ణ, సాయి శంకర్ తదితరులు నటించారు. సంతోష్ గోపీనాథ్ కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ నగరంలో తాజాగా జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న నిర్మాత కె.రాజన్ మాట్లాడుతూ, 'ఒక చిత్రానికి దర్శకుడు, హీరో కంటే నిర్మాత ముఖ్యం. కోలీవుడ్‌లో యేడాదికి 200కు పైగా చిత్రాలు వస్తున్నాయి. 150 మంది నిర్మాతలు కనిపించకుండా పోతున్నారు. దీనికి కారణం ఎవరు? ఒక నిర్మాత బాగుండాలని ఏ నటుడైతే కోరుకుంటారో ఆ హీరో ఉన్నతస్థాయికి చేరుకుంటారు. ఇటీవలికాలంలో పెద్ద హీరోల చిత్రాలు నిరాశపరిచినప్పటికీ చిన్న చిత్రాలు ఘన విజయం సాధించాయి. ఇది చిత్రపరిశ్రమకు, చిన్న నిర్మాతలకు మంచిది' అన్నారు. సీనియర్ దర్శకుడు కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ, 'నిర్మాత లేకుండా దర్శకుడు, హీరో లేరంటున్నారు. నిజం చెప్పాలంటే మంచి కథ లేకుంటే నిర్మాతే లేడు. ఒక వ్యక్తికి సినిమాపై వ్యామోహం పెరిగితే అది ఎన్నటికీ పోదు. ఈ సినిమాను 25 రోజుల్లోనే చిత్రీకరణ పూర్తి చేయడం శుభపరిణామం. '16 వయదిలే' చిత్రం కూడా 32 రోజుల్లో నిర్మించారు. సూపర్ హిట్ అయింది. ఎన్నిరోజుల్లో పూర్తి చేశామన్న అంశంతో ఒక చిత్రం జయాపజయాలను నిర్ణయించలేం' అని అన్నారు. అలాగే, చిత్ర దర్శక నిర్మాతలు, హీరో, హీరోయిన్, ఇతర నటీనటులు ఈ కార్యక్రమం ప్రసంగించారు.

మంచి నటుడు అనిపించుకోవాలని ఉంది

● హీరో ధీరజ్

చిత్రజ్యోతి

తాను గొప్ప హీరో కావడం కంటే ఒక మంచి నటుడు అనిపించుకోవాలని ఉందని 'డబుల్ టక్కర్' ఫేం ధీరజ్ అన్నారు. ఈయన నటించిన తాజా చిత్రం 'పిళ్ళైయార్ సుళి'. మనోహరన్ పెరియతంబి దర్శకత్వం వహించారు. అభినయ హీరోయిన్. ఇప్పటికే నిర్మాణాంతర పనులన్నీ పూర్తి చేసుకుంది. వినాయక చవితి రోజున విడుదల చేయాలని భావించినప్పటికీ.. విజయ్ 'ది గోట్' విడుదల కారణంగా వాయిదా వేశారు. ఇపుడు ఈ యేడాది ఆఖరులో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టి, ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా, హీరో ధీరజ్, దర్శకుడు మనోహరన్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. 'ఇదిపూర్తిగా మానసిక సమస్యలతో బాధపడే చిన్నారుల కథాంశంతో తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. దివ్యాంగులు కూడా సమాజంలో భాగమేనని, వారికి కూడా కొంత స్పేస్ ఇవ్వాలన్న సందేశంతో రూపొందించాం. ఇప్పటికే న్యూయార్క్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రన్నర్ ఎగా నిలిచింది. ఇటీవలికాలంలో తమిళం నుంచి ఇలాంటి చిత్రం ఫిల్మ్ ఫెస్టివల్‌కు రాలేదని నిర్వాహకులు వ్యాఖ్యానించారు. హీరో ధీరజ్ మాట్లాడుతూ, 'డబుల్ టక్కర్' తర్వాత మరోమారు పిల్లల కథాంశాన్ని ఎంచుకోవడానికి ప్రధాన కారణం ఈ స్క్రిప్టు. నిజ జీవితంలో వైద్యుడైన నాకు.. మానసిక దివ్యాంగ చిన్నారుల కథాంశంతో కూడిన సినిమాలో నటించడం సంతోషంగా ఉంది. ఈ సినిమా చూసిన తర్వాత ప్రతిఒక్కరూ దివ్యాంగులు కూడా మనలో భాగమేనన్న భావన కలిగి వారికి ప్రైవసీని ఇస్తారు. ఇలాంటి కథలను ఎంచుకోవడానికి ప్రధాన కారణం.. ఒక గొప్ప హీరో కావడం కంటే ఒక మంచి నటుడు అనిపిచుకోవాలన్నదే నా కోరిక. వైద్య వృత్తికి ఆటంకం కలగకుండా సినిమాల్లో నటిస్తాను. హృద్రోగ నిపుణుడిగా మనిషి గుండె చేతులతో తాకడం అనేది దేవుడు ప్రసాదించిన వరం. అలాంటి వైద్యవృత్తికి ఆటంకం లేకుండా సినిమాలు చేస్తాను. సీనియర్ నటి రేవతి ఈ స్టోరీ విన్న తర్వాత పారితోషికం తీసుకోకుండా నటించారు. హీరోయిన్ అభినయ ఓ మంచి పాత్రలో కనిపిస్తారు. ఇందులో నేను ఇద్దరు పిల్లల తండ్రిగా నటించాను. త్వరలోనే విడుదల చేస్తాం. మీడియా సపోర్టు చేయాలి' అని కోరారు.



'పిళ్ళైయార్ సుళి'లో రేవతి, ధీరజ్ తదితరులు

మహిళల భద్రతపై ఫెఫ్సీ తరపున కమిటీ

● ఆర్.కె.సెల్వమణి



చిత్రపరిశ్రమలో మహిళల భద్రతాంశంపై దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు, సీనియర్ దర్శకుడు ఆర్.కె.సెల్వమణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండస్ట్రీలో మహిళల భద్రతపై ఫెఫ్సీ తరపున దర్శకుల సంఘం, సినిమాటోగ్రాఫర్స్ అసోసియేషన్, డబ్బింగ్ యూనియన్ సహా ఏడు సంఘాలతో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నాం. ఇందులో వివిధ రకాల వేధింపులకు గురైన మహిళలు ఫిర్యాదు చేయొచ్చు. చిత్ర పరిశ్రమలో నిబంధనలను పునఃపరిశీలించి మరింతగా మెరుగు పరచాలని నిర్మాతల మండలి నిర్ణయం తీసుకుంది. నవంబరు ఒకటో తేదీ నుంచి కొత్త నిబంధనలతో షూటింగులు ప్రారంభించాలని లేనిపక్షంలో ఒక సానుకూల వాతావరణం ఏర్పడేంత వరకు అన్ని చిత్ర నిర్మాణాలను నిలిపివేయాలని నిర్మాతల మండలి ఒక నిర్ణయానికి వచ్చింది. దీనికి సంబంధించి ఫెఫ్సీ తరపున నిర్మాతల మండలికి వివరణ ఇచ్చాం. త్వరలో చర్చలు ప్రారంభించి, సమస్యకు పరిష్కారం కనుగొనాలని కోరుతున్నాం. కొత్త చిత్రాల ప్రారంభోత్సవాలు నిలిపివేయడం వల్ల సినీ నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల అక్టోబరు ఒకటో తేదీ నుంచి కొత్త నిబంధనలతో సినీ షూటింగులు ప్రారంభించాలని కోరుతున్నట్టు ఆర్.కె.సెల్వమణి తన ప్రకటనలో పేర్కొన్నారు.

ఫెఫ్సీ వైఖరిని ఖండించిన నడిగర్ సంఘం

అడయార్, సెప్టెంబరు 18: హీరో ధనుష్ అంశంలో దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సంఘం ఫెఫ్సీ తాజాగా విడుదల చేసిన ప్రకటనను నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది. ఇదే విషయంపై నడిగర్ సంఘం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమిళ చిత్రపరిశ్రమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తమిళ చలన చిత్ర నిర్మాతల మండలి, దక్షిణ భారత నటీనటుల సంఘం (నడిగర్ సంఘం) మధ్య పలు దఫాలుగా జరిగిన చర్చల ఫలితంగా ఒక సుహృద్భావ వాతావరణంలో ఒక అవగాహనా ఒప్పందం కుదిరింది. నడిగర్ సంఘం చేసి 37 సిఫార్సులతో కూడిన నివేదికను కూడా నిర్మాతల మండలికి అప్పగించారు. ఈ నేపథ్యంలో హీరో ధనుష్ అంశంపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు ఫెఫ్సీ ప్రకటించడం నడిగర్ సంఘం విస్మయం వ్యక్తం చేసింది. నిర్మాతలు - నటీనటుల మధ్య తలెత్తే సమస్యలను రెండు సంఘాలు కలిసి సజావుగా పరిష్కరిస్తున్నపుడు కొత్తగా కమిటీని ఏర్పాటు చేస్తామని ఫెఫ్సీ పేర్కొనడాన్ని నడిగర్ సంఘం తప్పుబట్టింది. అంతేకాకుండా, ఫెఫ్సీ కార్మికులతో పాటు ప్రతి సినీ కళాకారుడి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే నడిగర్ సంఘం చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతుందని, ఇలాంటి సమయంలో ఏకపక్షంగా, తమను తాము అధికార కేంద్రంగా చిత్రీకరించుకునే చర్యల్లో భాగంగా ఇలాంటి ప్రకటనలు చేయడం ఏమాత్రం సబబు కాదని పేర్కొంటూ, ఫెఫ్సీ ప్రకటనను నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది.

భక్తజన సాగరం

● తిరుచెందూరులో పురటాసి పౌర్ణమి జాగారం



తిరుచెందూరు సముద్రతీరంలో పూజలు చేస్తున్న మహిళలు

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం కుమారస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రంగా ఖ్యాతిగాంచిన తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ప్రతి నెలా పౌర్ణమి రోజు వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఆ మేరకు మంగళవారం పురటాసి మాస పౌర్ణమిని పురస్కరించుకుని పలు జిల్లాల నుంచి భక్తులు తిరుచెందూరు ఆలయానికి పోటెత్తారు. రాత్రి ప్రధాన ఆలయానికి చేరువగా ఉన్న సముద్రతీరంలో భక్తులంతా జాగారం చేశారు. మహిళా భక్తులు అఖండ దీపాలు వెలిగించి స్వామివారిని కీర్తిస్తూ జాగారం చేశారు. బుధవారం ఉదయం ఈ భక్తులందరూ సముద్రతీరంలో స్నానమాచరించి, నాళికినురు (బావి) వద్ద తలస్నానం చేసి, శుభ్రమైన దుస్తులు ధరించి స్వామివారిని దర్శించేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్ళిన భక్తులు స్వామివారిని దర్శించేందుకు సుమారు రెండు గంటలపాటు వేచి ఉండాల్సి వచ్చింది. ఇక రూ.100ల ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో వెళ్ళిన భక్తులు స్వామివారిని అరగంటలోపున దర్శించారు. పౌర్ణమి ప్రత్యేక పూజలు, ప్రత్యేక దర్శనం చేసుకోవడానికి వచ్చిన వేలాదిమంది భక్తులు ఆలయ నిర్వాహకులు అన్ని వసతులు కల్పించారు. మంగళవారం ఉదయం పది గంటల నుండి రాత్రి పది గంటల వరకు, మళ్ళీ బుధవారం ఉదయం పది నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులకు అన్నదానం నిర్వహించారు. తూత్తుకుడి డీఎస్పీ ఆలబర్ట్ జాన్ ఉత్తర్వు మేరకు తిరుచెందూరు ఏడీఎస్పీ వసంతరాజ్ నాయకత్వంలో పోలీసులు భక్తులకు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.



సముద్రతీరంలో జాగారం చేస్తున్న భక్తులు



గిండి వద్ద డీజేటీహైకా కంపెనీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీలు డా. కళానిధి వీరాసామి, డా. కనిమొళి సోము

ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఛార్జర్ సెంటర్ ప్రారంభం

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో పేరుగాంచిన డీజేటీ హైకా సంస్థ నగరంలోని గిండి వద్ద ఎలక్ట్రిక్ వాహనాలను ఛార్జింగ్ చేసుకోవడానికి అనువుగా ఛార్జర్ సెంటర్ ఏర్పాటు చేసింది. ఈ ఛార్జర్ పరికరాన్ని ఎంపీలు డాక్టర్ కళానిధి వీరాసామి, డాక్టర్ కనిమొళి సోము ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపకుడు సంజయ్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ మనీందర్, స్మయిల్ ఎక్స్‌ఈవీ డైరెక్టర్ రాజా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అగర్వాల్ ఐ హాస్పిటల్‌లో రెండు కొత్త పరికరాలు



కొత్త పరికరాల విభాగాన్ని ప్రారంభిస్తున్న తాంబరం మేయర్ వసంతకుమారి, డిప్యూటీ మేయర్ కామరాజ్

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాంబరం డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్‌లో రోగులకు మెరుగైన నేత్ర చికిత్స అందించటానికి అల్కాన్ వేవ్‌లైట్ ఈఎక్స్500, అల్లీగ్రో లోపోలైజర్ వేరియో సిస్టం అంటూ రెండు సరికొత్త పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు పరికరాలకు తాంబరం మేయర్ వసంతకుమారి, డిప్యూటీ మేయర్ కామరాజ్ బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ క్లినికల్ సర్వీసెస్ రీజనల్ హెడ్ డాక్టర్ శ్రీనివాసరావు, సీనియర్ కన్సల్టెంట్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ ఉమాదేవి జయవేలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గ్రీవెన్స్



సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, సెప్టెంబరు 18: స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ అరుణ్ పాల్గొని, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యంలపై 39 వినతిపత్రాలు రాగా, వాటిని విచారించిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లను కమిషనర్ ఆదేశించారు.



పెరియార్ సిద్ధాంతాలపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో మంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితరులు

పెరియార్ సిద్ధాంతాలు నేటికీ ఆచరణీయం

● మంత్రి ఉదయనిధి

చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళ ప్రజల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందింపజేసిన ద్రవిడ ఉద్యమనేత పెరియార్ సిద్ధాంతాలు, ఆశయాలు నేటి తరానికి ఆచరణీయమేనని రాష్ట్ర యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి అన్నారు. పెరియార్ జయంతి వేడుకల సందర్భంగా కోట్టూరుపురంలో అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయం హాలులో బుధవారం ఉదయం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. పెరియార్ జీవిత పర్యంతమూ మహిళాభ్యుదయం కోసం పోరాడారని, వంటింటికే పరిమితమైన మహిళలకు అక్షరాస్యత అందించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారని, ఆయన కృషి వల్లే మగువల మగవారితో అన్ని రంగాలలో పోటీపడుతున్నారని చెప్పారు. గత మూడేళ్లుగా డీఎంకే ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలు దేశవ్యాప్తంగా ఖ్యాతి గడించాయని తెలిపారు. ఈ సదస్సులో సినీ దర్శకుడు కరు పళనియప్పన్, ద్రావిడ కళగం డిప్యూటీ ప్రధానకార్యదర్శి మదివదని, గెనిత్‌రాజ్ అన్బు తదితరులు ప్రసంగించారు.

రేనోల్ట్ నుంచి కొత్తగా మూడు మోడళ్ళు



అడయార్, సెప్టెంబరు 18: పండగ సీజన్ వేళ అధునాతన ఫెయిర్ జోడిస్తూ రెనోల్ట్ ఇండియా కంపెనీ కిగర్, ట్రైబర్, క్విడ్ నైట్ అండ్ డే లిమిటెడ్ ఎడిషన్ ఆవిష్కరించింది. ఈ స్టైలిష్ డిజైన్, ఆధునిక ఫీచర్లను ఇందులో పొందుపరిచింది. నైట్ అండ్ డే లిమిటెడ్ ఎడిషన్‌లో మూడు మోడళ్ళలో మిస్టరీ బ్లాక్ రూఫ్ డ్యూయల్ టోన్ బాడీ కలర్‌తో ప్రత్యేకమైన పెర్ల్‌వైట్‌ను పరిచయం చేసింది. ఇది అర్బన్ ఫ్రెండీ డిజైన్‌ను మిళితం చేసే ఎలివేటెడ్ లుక్ అందిస్తుందని ఆ కంపెనీ కంట్రీ సీఈవో వెంకట్రామ్ మామిళ్ళపల్లి బుధవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ నైట్ అండ్ డే లిమిటెడ్ ఎడిషన్‌లో ట్రైబర్ ధర రూ.7 లక్షలు, కిగర్ ధర రూ.6.74 లక్షలు, క్విడ్ ధర రూ.4.99 లక్షలుగా ఉందని ఆయన పేర్కొన్నారు.

తిరుచెందూర్‌లో వెనక్కివెళ్లిన సముద్రం



పెరంబూర్, సెప్టెంబరు 18: సముద్రతీరంలో వెలసిన తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి వచ్చే భక్తులు మొదట సముద్ర స్నానం చేసి స్వామి దర్శనం చేసుకుంటారు. ఈ నేపథ్యంలో, సాధారణంగా ఆలయ సమీపంలోని సముద్రతీరం అమావాస్య, పౌర్ణమి రోజుల్లో నిర్ణీత సమయంలో వెనక్కి వెళ్లడం జరుగుతుంటోంది. ఆ ప్రకారం, పౌర్ణమి రోజైన మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు సుబ్రమణ్యస్వామి ఆలయం నుంచి మధ్యలో ఉన్న అయ్యావైకుంఠ అవతార ఘాట్ వరకు సుమారు 500 మీటర్ల మేర నీటిమట్టం 50 అడుగుల వెనక్కి వెళ్లింది. దీంతో, నాచుతో కూడిన బండరాళ్లు బయటపడ్డాయి. అలలు లేని కారణంగా సముద్రం చిన్న కొలనులా కనిపించింది.



గిరి ప్రదక్షిణలో భక్తులు

ఎనిమిదేళ్ల అనంతరం బృహదీశ్వరాలయ గిరి ప్రదక్షిణ

పెరంబూర్, సెప్టెంబరు 18: తంజావూరు బృహదీశ్వరాలయ గిరి ప్రదక్షిణ మార్గం ఎనిమిదేళ్ల అనంతరం తెరడంతో, పెద్దసంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. బృహదీశ్వరాలయం చుట్టూ సుమారు 3 కి.మీ ఉన్న గిరి ప్రదక్షిణ మార్గాన్ని 2014లో ఆలయ మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు చేపట్టిన జీర్ణోద్ధరణ పనుల కారణంగా మూసివేశారు. భక్తుల కోరిక మేరకు ఎనిమిదేళ్ల అనంతరం మంగళవారం గిరి ప్రదక్షిణకు భక్తులను అనుమతివ్వడంతో, వేలాది మంది గిరి ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకున్నారు.



నాగపట్టినంలో తమిళనాడు డాక్టర్ జె.జయలలిత మత్స్య విశ్వవిద్యాలయం 9వ స్నాతకోత్సవంలో పతకాలు అందుకున్న విద్యార్థులతో గవర్నర్ ఆర్ఎన్ రవి